గుడ్డివాడు



"రంగంపేట్లో గంగమ్మ జాతర. ఆ రంగ రంగ వైబోగంవే వైబోగం. కోలాటాలేనా... పలకల దరువులేనా... ఏలపదాలేనా... రకరకాల ఏశాలుగట్టేవాళ్ళేనా... తిరుగు మరుగు లేకుండా వాళ్ళు గొంతెత్తి పాడే బూతు పాట్లేనా... అరమరికలు లేకుండా ఆడా మొగా తేడా లేకుండా ఆ బూతు పాట్లింటా ఒళ్ళు మర్సిన అమాయకుల నడమన ఆ ఆనందంవే ఆనందం! ఆ అనుబోగవే అనుబోగం! ఆ అనుబూతే అనుబూతి! అనడానికి మాలదు కానీ అనుబోగించి తీరాల్సిందే" అని వాళ్ళూ వీళ్ళూ అంటూ ఉంటే విన్నాను.

నాలో నేనే నవ్వుకొన్నాను! ఎందుకంటే?... నా చిన్నప్పుడు మా అమ్మ "ఒరే అబ్బోడా! ఈ ఎండలు గాసే బూమండలంలో జాతరంటే తిరపతి గంగమ్మ జాతరేరా! అటుమంటి జాతర్ను ఇంకేడా సూళ్ళేము. సూడబోము. మంగళారంతో మొదులుబెట్టి మళ్ళా మంగళారంతో ఆకీరైపొయ్యే ఆ జాతర వైబోగాన్ని ఏడు కొండల వాడే సుక్కల పర్వతం మింది కొచ్చి గాలి గోపరం కాడ

కూసోని కన్నట్టార్పకుండా సూస్తాడంట" అని అంటా ఉంటే ఆ మాటలు నా లేత హృదయ ఫలకం మీద చెరగని శిలాక్షరాలయ్యాయి!

అయితే తిరుపతి గంగమ్మకు ఈ నాగరీకుల మధ్యలో గత వైభవ స్మృతులు మాత్రమే మిగిలినట్లుంది. జాతర కళలు కళ తప్పుతున్నాయి. ఆ తలపోతల్లోనే ఆమె 'ఆహా! ఓడలు బండ్లయినాయి గదా?' అని విచారపడ్తూ ఉంటే రంగంపేట గంగమ్మ కథ రంగరంగ వైభోగంగా ఉన్నట్టుంది.

అందుకే వెళ్ళి చూడాలనుకొన్నాను.

అయితే, నిజానికి నేను చూడాలనుకొనింది గంగమ్మ జాతర వైభవాలు కాదు. ఆ కోలాటం పాటల్లో... ఆ ఏల పదాల్లో.. ఆ బూతు పాటల్లో అప్రయత్నంగా దొరలే అందమైన అచ్చ తెనుగు పదాలను వినాలనిపించింది. సగం తెలుగుగా సగం ఆంగ్లంగా కలగలిసి ఈ తెలుగు భాషను ఉద్ధరిస్తున్నామని మాట్లాడే ఈ కృత్రిమ తెలుగు వినీ వినీ తుప్పు పట్టిన చెవులకు అదొక గొప్ప అనుభూతి. అందుకే రంగంపేట గంగమ్మ జాతరకు బయల్దేరుతున్నాను.

"ఎక్కడికి?"

ఉరుము ఉరిమినట్లు .... పిడుగు సరాసరి నెత్తినపడినట్టు మాట చెవుల్లో పడేసరికి ఉలిక్కిపడ్డాను. తల పైకెత్తాను. ఎదురుగా శ్రీమతి. నా మతి పొయ్యేటట్టుగా నా వైపు ఉరిమి ఉరిమి చూస్తూ ఉంది.

నా నోటంట మాట రాలేదు.

"ఈ కొంపలో మొగోడికి ఇపరీతపు బుద్దులుణ్ణెట్టే ఈ తిరపతిలో ఎండలుగాసేది కూడా ఇపరీతంగానే ఉండాది. ఎట్టుండాది ఎండ? సెంద్రనిప్పులు శాటల్లోఎత్తి ఈదుల్లో సెరిగి పోసినట్టుండాదే? ఎక్కడ కొంపలంటకపోతా ఉండాయో? ఎక్కడ కొండల్ను పిండి గొట్టాల్నో? ఈ ఎండలో ఎలబార్తా ఉండాడు గదమ్మా ఈ యింట్లో మొగోడు?"

ఇంటి గోడవైపు చూస్తూ ఆ గోడతో మొరబెట్టుకొంటున్నట్లుంది మా శ్రీమతి– ఉద్దేశించింది నన్నయితే కూడా.

"ఒసే నా వయ్యారి భామా! నా వలపుల గిలకా! నా సిలకల కొలికీ! వేలెడంత పిల్లల్ని చూస్తే 'మమ్మీ! డాడీ!' అనడం తప్పిస్తే హాయిగా 'అమ్మా! నాన్నా!' అని పిలిచే స్థితి ఎప్పుడో చేదాటిపోయింది. కాలక్షేపానికి కథా కమామిషో చదువుకుందామని ఏదైనా ఒక పత్రిక చేతికెత్తుకుంటే అది తెలుగో ఆంగ్లమో అర్థంకాని మొత్తుకోళ్ళు. రంగంపేటలో గంగమ్మ జాతరంట. రంగ రంగ వైభోగంగా..... జరుగుతుందంట. ఆ కోలాటం పాటల్లో .... ఆ ఏలపదాల్లో... ఆ బూతు పాటల్లో మరుగున పడిపోతా ఉండే మంచి తెలుగు పదాలను ఏరి తెచ్చుకుంటానే!" అని అంటే ఆ తల తిక్కమనిషికి తలకెక్కుతుందా? నాకు నమ్మకం లేదు. తల కెక్కక పోగా పక్కింటి పార్వతమ్మనో ఎదురింటి అన్నపూర్ణమ్మనో పిలిపించి "మా ఇంట్లో భాషా సేవకుడు

ఎలబార్తా ఉండాడమ్మా. రండి రండి! ఒకరి కిద్దరు ముత్తయిదులు ఎదురుంగా రండి. ముత్తయిదు సగిణం మంచి సగిణం గదా?" అని ఎగతాళి పట్టించినా పట్టిస్తుంది.

ఆ మాట అననేల? దానికి రెండు రానేల? కొంచెం సేపు చెవులు వినపడవు. కండ్లు కనపడవు– అని అనుకొంటే సరిపోతుందని నా ప్రయత్నం నాదిగా నేను బయలుదేరుతున్నాను.

"అయితే పోతా ఉండావు గదా? పోపో! అప్పిటికి నువ్వెందుకు పోతా ఉండావో నాకు తెల్దనుకుణ్ణావా? ఆ జాతర సాకు బెట్టి రంగంపేట కొచ్చే ఇడ్సేసిన ముండమోపుల్ను సూడాలని గదా నీ మునాస! అయినా బిడ్లకు బిడ్లయినారు గదా? ఇంకా ఎందుకే నీకీ పాడు బుద్ది?"

అదీ ఆడదాని బుద్ధి! ఏమని బదులు చెప్పగలం?

మాటకు మాటతో మనస్సులు బాధపడడం తప్ప ప్రయోజనం ఉండదు. అందుకే ఆమె మాటల్ని ఈచెవుతో విన్నట్టుగా విన్నాను. ఆ చెవుతో అలానే వదిలిపెట్టాను. నేను ఇల్లు విడిచి బయటపడ్డాను.

మా శ్రీమతి అనిన మాట నిజమే!

పొద్దు బాగా పడమటి వైపుకు వాలిపోయినా ఎండ చెంద్ర నిప్పుల్ని చేటలకెత్తి చెరిగిపోసినట్లే ఉంది. వడగాడ్పులు గుబల్ని అదరగొడ్తున్నాయి. సాధారణంగా ఆ వేళప్పటికి జన ప్రవాహంతో ఊపిరి సలుపుకోలేని వీధులు ఊసురోమంటున్నాయి. ఆ వడ గాల్పులు దెబ్బంతా నా ఒక్కడి పరమయ్యేటప్పటికి అడుగుదీసి అడుగుపెట్టడం అబ్బో కష్టసాధ్యంగా ఉంది. ఆ స్థితిలో మా తలతిక్క మనిషి మాటలు బాగా తలకెక్కుతున్నాయి. మాటలే కఠినం. మనసు వెన్న. తన భర్త ఈ ఎండ వాత పడడం ఆమెకు ఇష్టం లేదు. ఆ అయిష్టత నిష్టురోక్తులయ్యాయి. ఆ నిష్ఠూరంలో నిగూఢంగా ఎంతటి ఆత్మీయత? మరెంత ఆవేదన?

బయలుదేరుతుంటే ఆమె పడిన మధనలోని ఆంతర్యం అర్థమయ్యే సరికి ఆలోచనలు ఎటెటో పోతున్నాయి. ఎండలో నడుస్తున్నానన్న మాటే మరిచాను. బహుశా అలూమగల మధ్య నిష్టురోక్తుల్లో అంతర్లీనమైన ఈ ఆత్మీయతే సంసారాలు సాఫీగా సాగడానికి దోహదం చేస్తున్నది. లేకపోతే దినానికి ఎన్ని విడాకులో? ఏమో?

బస్టాండు చేరుకొన్నాను.

బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. వచ్చిన బస్సుల్లో నుండి దిగిన జనం ఎటు పోవాలో ఏమో దిక్కు తోచనట్లుగా దిక్కులు చూస్తూ నిలబడుకొంటున్నారు. బయలుదేరిపోతున్న బస్సుల్లో చోటు దొరకక నిలబడిన వాళ్ళు దిక్కులు చూస్తున్నారు. ఎర్రబస్సులు మాత్రం ఎవరినీ లక్ష్య పెట్టకుండా 'మీ దిక్కున్న చోటుకుపోయి చెప్పుకోండి' అన్నట్టుగా దిక్కుకొకటి పరుగెత్తుతున్నాయి.

రంగంపేట జాతర కళ తిరుపతి బస్టాండులోనే కనిపిస్తూ ఉంది.

నా శక్తినంతా కూడగట్టుకొని ఆ జనారణ్యాన్ని ఛేదించుకొని భీమవరం బస్సెక్కాను. నా మాదిరి కొంతమంది మగవాళ్ళు ఆ మగవాళ్ళకు రెండింతలుగా ఆడవాళ్ళు పోటీ పడుతూ

ఎక్కారు. అడ్డుపడినవాళ్ళను వెనక్కి తోసేస్తూ... పక్కకు పెట్టేస్తూ... అవసరమైతే ఈడ్చి అవతల పారేస్తూ- భీమవరం బస్సెక్కిన ఆడవాండ్లను మనసారా అభినందించాను. ఈ తెగువ ఈ సాహసం స్త్రీ జాతి అవసరమైన చోట ప్రదర్శించగలిగితే ఈ దేశ స్వరూప స్వభావాలు ఎంతగా మారిపోవునో? అని ఆలోచిస్తూ ఉంటే బస్సు బయలుదేరింది.

బ్రతుకుజీవుడా! అనుకున్నాను.

ఎందుకంటే? ఎండనపడి రావడం... వచ్చీ రావడంతోటే జనం సందున ఇరుక్కొని పోవడం... గాలి ఆడడం లేదు. విపరీతంగా ఉక్కపోస్తూ ఉంది. చొక్కా చెమటతో తడిసి ముద్దయింది. ఆ పరిస్థితి అలానే మరికొంత సేపు కొనసాగితే రంగంపేట జాతర అక్కడే కనిపించేది. బస్సు కదిలింది. గాలి ఆడుతూ ఉంది. ఒంటి కాలి మీద బతుకైనా ఇక ఫరవాలేదులే! అని ఊపిరి పీల్చుకొన్నాను. అయితే, బస్సులో నన్ను చుట్టుముట్టిన ఒక్కొక్క ఒంటి మీద నుండి ఒక్కొక్క రకం వాసన... రకరకాల వాసనలు కలగలిసే సరికి అదొక చిత్రమైన వాసనగా తయారయింది. భరించడం కష్టసాధ్యంగా ఉంది. ఏం చేయాలో తోచనపుడు ఉన్నాడు గదా తేరకొకడు. భగవంతుడు. వాడినే తలుచుకొంటున్నాను.

బస్సు కృష్ణాపురం ఠాణా దాటింది. టౌన్ క్లబ్ దాటింది. బాలాజీ కాలనీ సమీపాన పోతూ ఉంది. ఆ ఎర్ర బస్సు ఏ కాలం నాటిదో? ఏం పాడో? ప్రజాసేవ కర్తవ్యంలో పండిపోయినా నన్ను ఇంకా ఎందుకు చంపుక తింటున్నారన్నట్లుగా ఎగిరెగిరి పడుతూ ఉంది.

"టికెట్ సార్! టిక్కెట్ ప్లీజ్" అంటూ కండక్టర్ అడిగి అడిగి టిక్కెట్లు ఇస్తున్నాడు. అతడు మనుషుల మధ్య దూరడం గమనిస్తూ ఉంటే అతగాడి ఒంటిలో ఎముకలున్నాయా? లేవా? అన్న సందేహం కలుగుతూ ఉంది. ఒంటికాలిమీద తపోభంగిమలో నిలబడిన నేను జేబులో చెయ్యిపెట్టి డబ్బు తీసి టికెట్టు కొనాలి. అది సాధ్యపడే పనేనా?

"సార్!"

బస్సులో ఎవరో ఎవరినో పిలుస్తున్న పిలుపు. నా చెవిని పడింది. నిజానికి కిక్కిరిసిన బస్సులో నా చావు నాదిగా ఉంది. కాలు కదలడానికి లేదు. చెయ్యి తిరగడానికి లేదు. టిక్కెట్టు కొనడం తక్షణ సమస్య. ఆ సమస్యా పరిష్కారానికి నా తంటాలు నేను పడుతున్నాను. అంతలోనే "మిమ్మల్నే సార్" అన్న పిలుపుతో కూడా నా చేతిని ఇంకొక చెయ్యి తాకుతూ ఉంది.

చాలా కష్టపడి మెడను స్వాధీనంలోనికి తెచ్చుకొని జనం సందుల్లో నుండి వచ్చిన చేతి మీదుగా దృష్టిని సారించాను. ఆ బస్సులో కిటికీ పక్కన కూర్చొని నా వైపే నిక్కి నిక్కి చూస్తున్నాడొక పిల్లవాడు.

వత్తుగా ఉంగరాలు తిరిగిన జుట్టు... ఏర్పడీ ఏర్పడని మీసకట్టు... కాంతివంతమైన కండ్లు... చక్కని పలువరస... పదహైదు పదహారేండ్లు ఉండవచ్చునేమో! చూడముచ్చటగా ఉన్నాడా పిల్లవాడు.

"ఏం?" అన్నట్టుగా అతడివైపు చూశాను.

"మొన్న టీవీలో ప్రోగ్రాం ఇచ్చింది మీరేగద సార్?"

"ఎందుకయ్యా?"

"అవునా...కాదా...అని!"

"నేనేనయ్యా!"

ఆ మాట చెవినిపడేసరికి అతడి మొగం నిండుకు ఆనందం తొణికిసలాడింది. కన్నులు మిలమిల మెరుస్తున్నాయి. పెదవుల మీద చిరునవ్వుల పువ్వులు పూశాయి. ఆ పిల్లవాడు పైకి లేస్తూ "మీరు కూర్చోండి సార్" అన్నాడు.

"ఫరవాలేదు లేవయ్యా!"

"మీరు పెద్దవారు. కూర్చోండి సార్" అంటూ నా మాట వినిపించుకోకుండా జనం మధ్య దూరి నా దగ్గరికి వచ్చే ప్రయత్నంలో ఉన్నాడు. అతని వాలకం చూస్తే వద్దన్నా వినేటట్టుగా లేడు.

ఇప్పుడు కిటికీ పక్కన సీటు. హాయిగా ఉంది. ఒకరు ఇస్తే అనుభవించే సుఖం స్వర్గమైతే ఆ స్వర్గ సుఖం నాకు దక్కింది. ఈ దేశంలో కళాకారులకు బస్సులో సీటేగాదు రాజ్య సింహాసనాలు కూడా సులభంగానే దక్కుతున్నాయి. కళాకారులూ జిందాబాద్!

బస్సు పేరూరు దాటింది. పెరుమాళ్ళపల్లిని దాటింది. కాలూరు దగ్గర ఎవరో చెయ్యి అడ్డం పెట్టినా సద్ద చెయ్యకుండా స్వర్ణముఖి నదిని దాటుతూ ఉంది. ఆ నదిలో అగస్తీశ్వర దేవాలం. ఒంటికాలిమీద నిలబడి అంతవరకు ఆ బస్సులో చేసిన తపఃఫలితంగా అగస్తీశ్వరుడు దర్శనమిచ్చినట్టుగా జనం ఆ దేవుడికి దండాలు పెడుతున్నారు బస్సులో నిలబడే.

నేను రంగంపేట జాతర వైభవాన్ని ఊహిస్తూ కూర్చున్నాను.

బస్సు ఆగుతూ ఆగినచోట కొంతమందిని దింపి మరికొంతమందిని ఎక్కించుకుంటూ పన్నెండు కిలోమీటర్ల దూరాన ఉన్న చంద్రగిరిని చేరడానికి గంట కాలం పట్టింది. ఈ దేశంలో ప్రజల ఓపిక మెచ్చుకో తగిందే.

ఆ డొక్కుబస్సు డ్రైవర్ ఓపికను కూడా పరీక్షించినట్లుంది. చంద్రగిరిలో బాట పక్కగా అతడా బస్సును నిలబెట్టి అక్కడొక టీ అంగడి మీద పడ్డాడు. అక్కడొక వయ్యారి భామ టీ కలుపుతూ ఉంది. ఆ అందాల బొమ్మ చేతినుండి టీ అందుకున్నాడు. టీ గుటక లేస్తూ కండ్లతో ఆమె అందాన్ని తాగుతూ మధ్య మధ్య నంజుకుంటున్నట్టుగా ఛలోక్తులు విసురుతున్నాడు. ఆ భామ ఒక మాదిర చూస్తూ ఇంకొక మాదిర నవ్వుతూ ఉంది. డ్రైవర్‌తో కలిసి టీ తాగడానికి వెళ్ళిన వాళ్ళు ఆ ఉచిత ప్రదర్శనతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు.

బస్సు పలచబడింది.

పలచబడిన బస్సు...వయ్యారిభామ చేతి టీ సేవించిన డ్రైవర్...బస్సు హుషారు మీద ఉంది. మరొక అర్ధగంటలో రంగంపేటలో దిగవచ్చు. అప్పటికి దాదాపుగా పొద్దుగూట్లో పడుతుంది. పొద్దు గూట్లో పడిందంటే ఇంకేముంది? జాతర ప్రారంభమైనట్లే! జాతర ఊహల్లో మనసు రంగంపేటలో. కట్టె కదులుతున్న బస్సులో!

ఉన్నట్లుండి శ్రావ్యమైన పాట...ఆ పాటకు లయగా ఢక్కీ దరువు చెవిని పడింది. రంగంపేట జాతర ఊహలకు రెక్కలొస్తే కండ్లు బస్సులో కలయచూస్తున్నాయి.

గోగుదంటులా సన్నగా పొడుగ్గా... పాత చింతపండు రంగునే మరపించేటట్లుగా రంగు... మాసిన గుడ్డలు... గడ్డంతో దిష్టి బొమ్మలా ఉన్నాడు. అయితే ఆ కంఠంలో మాధుర్యముంది. చేతిలో లయవుంది. శ్రావ్యంగా పాడుకొంటూ పాటకు అనుగుణంగా ఢక్కీ వాయిస్తున్నాడు. నా దృష్టి అటు యిటు కదలకుండా అతడిమీదనే నిలబడింది.

కాలూ చెయ్యి సక్రమంగా ఉన్నా ఆ ఆకారానికి రెండు కండ్లూ లేవు.

పాడుతున్న ఏదో సినిమా పాట పూర్తయింది.

"గుడ్డోణ్ణి! ఒక దరమం సెయ్యండి సాములాలా!" అని అడుక్కొంటున్నాడు. సాధారణంగా ఇటువంటి జనాన్ని రైళ్ళల్లో చూస్తుంటాం. వీళ్ళు బస్సులకు కూడా దిగుమతి అయ్యారే? అని నా సందేహాన్ని వ్యక్తం చేస్తే– ప్రక్కనున్న వ్యక్తి "వాడు టిక్కట్టు కొనుక్కునే ప్రయాణం చేస్తాడు సార్" అన్నాడు.

అతడి మీద నాకు గౌరవం కలిగింది.

"కన్నులేని కబోదోణ్ణి సాములాలా!.. మీరు నమిలి పారేసే ఆకూ వక్క.. తాగి పారేసే సిగరెట్టు ముక్క... ఒకపూట తమవి కాదనుకుంటే మీ బిడ్డల్లో ఒక బిడ్డ... రొండు కండ్లూ లేని కబోదోడు... బతికిపోతాడు సాములాలా!" అని అభ్యర్థిస్తున్నాడు.

నా బుర్రలో రకరకాల ఆలోచనలు.

ఆకాశవాణి... జానపద విభాగానికి అతడిని పరిచయం చేస్తే? ఇప్పుడు వింటున్న గొంతుకల కేమీ తీసిపోదు. ఒక గుడ్డివాడికి బ్రతుకుతెరువు చూపినట్లుంటుంది. వాడికి కూడా ఈ అడుక్కునే బాధ తప్పుతుంది. ఎక్కడుంటాడో ఏమో తెలుసుకోవాలి.

నా మనస్సులో ఒక నిర్ణయిం పడింది. వాడిని పలకరించాలన్న కోరిక కలిగింది. పిలిచాను. కానీ ఆ పిలుపు వాడి చెవికెక్కలేదు. వాడి లోకంలో వాడున్నాడు. అయినా వాడికి మాత్రం తెలియదా అడుక్కుతినే వాళ్ళకు ఆప్యాయతను అనురాగాన్ని చిందించే పలకరింపులు ఈ లోకంలో అరుదని.

అందుకే మళ్ళీ పిలిచాను.

నా పిలుపు వాడికి అందలేదుకానీ తాను లేచి నన్ను కూర్చోమని సీటు ఇచ్చిన పిల్లవాడు గ్రహించాడు.

"ఒరే గుడ్డెబ్బా! సార్ పిలస్తావుంటే వినపడలేదంట్రా? చెవుల్లో చెట్లేమైనా మొలిచినాయా? ఇట్లారా" అంటూ వాడిని పురమాయించాడు.

బస్సులో ఒక్కరిద్దరు "ఇట్టగాదట్రా! ఆఁ! అట్నే! అట్నే!" అని దారి చూపుతుంటే వాడు తారట్లాడుతూ నడుస్తున్నాడు. "ఆఁ! అక్కడే! అక్కడే! అక్కడే నిలబడ్రా!" అని ఇంకొక వ్యక్తి హెచ్చరించేసరికి వాడు నిలబడ్డాడు. నేను ఎదురుగా వున్నట్టు గ్రహించినట్టుంది "దండాలు దేవరా!" అన్నాడు.

"ఏవూరు మీది?"

"సెంద్రగిరి'

"చంద్రగిరిలో ఎక్కడుంటావ్?"

"కాల్నీలో"

"ఈ సినిమా పాటలేనా?.."

"నాటు పాటలు గూడా పాడ్తాను దేవరా!"

"అయితే- ఒక పాట పాడు విందాం."

"తమరెక్కడిదాక పోతావుండారు దేవరా?"

"రంగంపేట జాతరకు!"

"నేను గూడా ఆడికే వస్తావుండాను సామీ! దిగతానే రోడ్డు మలుపులో మర్రిమానొగిటుండాది గదా? ఆ సెట్టుకింద బండమీద కూసోండి. నేనాడికొచ్చేస్తా. ఆడ మీరెన్ని పాటలు పాడమంటే పాడతాను. ఆయరవదాకా ఈ బస్సులో అడుక్కుంటాను దేవరా!"

కనీసం టిక్కట్టు డబ్బయిన గిట్టకపోతే ఎలా అన్నట్టుంది వాడి తాపత్రయం.

నేనేమీ అభ్యంతరం చెప్పలేదు.

నా మౌనాన్ని అంగీకారంగా భావించి వాడు మళ్ళీ పాట అందుకున్నాడు. ఇచ్చిన వాళ్ళు ఇస్తున్నారు. లేనివాళ్ళు మొగాలు పక్కకు తిప్పేసుకుంటున్నారు. సినిమా పాటను అనుకరించడంలో వాడెంతవరకు కృతకృత్యుడయ్యాడని నేను గమనిస్తున్నాను. వాక్కులో స్పష్టత ఉంది. తాళజ్ఞానం ఉంది. రాగాన్ని చెడగొట్టడం లేదు.

"గుడ్డినాయాలు ఎంత బాగా పాడ్తాఉండాడ్రా?"

బస్సులో ఎవరిదో అభినందన!

"వాడు గుడ్డోడైనా దేముడు గుడ్డోడుకాదు కదా? ఈ లోకంలో బతికేదానికి వాడికీ వొక దోవ సూపించినాడు."

"ఆఁ! ఆఁ! ఈడు బొయ్ సూసేసొచ్చినా డబ్బా దేముడు ఈ గుడ్డోడికి బతికేదానికొక దోవ జూపించినాడని! కండ్లీకుండా కంట్లం మాత్రం ఇచ్చినాడంట. రొండూ ఇచ్చుంటే వాడబ్బ గంటేదన్నా పూడిస్తిందా?"

"ఇద్దో! ఇట్టా అగుటీటంగా మాట్లాడేకదా కురస్తావుణ్ణ వానలు గూడా కురవకుండా బొయ్యింది."

గుడ్డివాడితో ప్రారంభించిన చర్చ గుడిలో దేముడి మీదికి మళ్ళింది. పుర్రెకొక బుద్ధికదా? తలా తోక లేని వాదనలు వినడానికి తమాషాగా ఉన్నాయి.

'ఎన్నో వాదనలు విన్నాను. ఏడుపులు విన్నాను. పోట్లాటలు చవిచూశాను. ఇదంతా అలవాటేగదా?' అన్నట్లుగా బస్సు మిట్టపాళెం దాటింది. రైల్వే గేటు దాటింది. కూచేవాళ్ళపల్లి మర్రిమాను దాటింది. ఇక్కడికి నా బాధ్యత తీరిపోయిందన్నట్టుగా రంగంపేటలో నిలబడింది.

అక్కడ దిగవలసిన వాళ్ళకు రెండంతలమంది ఎక్కడానికి సిద్ధంగా ఉన్నారు.

సాధారణంగా బస్సు ఎక్కేటప్పుడు ఉండే తొందర దిగేటప్పుడు ఉండదు. దిగవలసినవాళ్ళు నిక్కి నీలిగి లేస్తుంటే ఎక్కవలసినవాళ్ళు ఒక మోపున ఎగబడుతున్నారు. ఫలితంగా దిగవలసిన వాళ్ళు దిగలేక ఎక్కవలసినవాళ్ళు ఎక్కలేక అక్కడొక యుద్ధం ప్రారంభమయింది.

"ఈ రంగంపేటోళ్ళతో వచ్చిన బాదే యిది. తలాతోకా రొండూ తెలియని మనుషులు. బస్సేంవన్నా పారిపూడస్తావుండాదా? దిగాల్సినవాళ్ళు దిగినాక ఎక్కితే మీ యబ్బగంటే వన్నా పూడిస్తిందా? వాళ్ళను దిగనీరు. మీరు ఎక్కలేరు." అని కండక్టర్ విసుక్కొంటున్నాడు.

డ్రైవర్ బస్సు నిలబెట్టి స్థిమితంగా కూర్చున్నాడు. నోట్లో బీడీ పొగ వలయాలు పోతూ ఉంది. నిమీలిత నేత్రాలతో పొగ వలయాల్లోని అందాన్ని ఆస్వాదిస్తున్నాడు. అతని ముందర 'పొగ త్రాగరాదు' బోర్డు సిగ్గుతో ఎరుపెక్కింది.

బస్సు ఎక్కినపుడు పడినంత కష్టం కాకపోయినా ఇంచుమించు అంత ప్రయాసతోనే బస్సు దిగాను.

రంగంపేట దగ్గర రోడ్డు లంబకోణాకృతిలో ఉంది. ఆ లంబకోణం ఏర్పడిన చోట మర్రిమాను. ఆ మర్రిమాను కిందొక చలువరాతి బండ. వెళ్ళి ఆ బండమీద కూర్చున్నాను.

దిగవలసిన వాళ్ళను దింపి ఎక్కవలసిన వాళ్ళను ఎక్కించుకొని బస్సు భీమవరంవైపు మళ్ళింది.

రంగంపేట జాతర కళతో ఒక్క వెలుగు వెలిగిపోతూ ఉంది. పలకలు... పంబల దరువులు మారుమోగిపోతున్నాయి. నా మనసు మాత్రం గుడ్డివాడి పాటమీదనే లగ్నమయింది. వాడికి జరుగబోయే సహాయం మాట దేవుడెరుగును కానీ, వాడు పాడే జానపదాల్లో మంచి పద జాలం దొరకవచ్చునన్నది స్వార్థం. ఆ బండమీద కూర్చొనివాడి కోసరం ఎదురుచూస్తున్నాను.

వాడు వచ్చాడు. కన్నీగటి పడుతున్న వేళలో రెండు కండ్లూ లేని కబోది – చేతి కఱ్ఱ సాయంతో తారట్లాడుతూ నేను కూర్చున్న బండ దగ్గరికి వచ్చాడు. సరిగ్గా నా ఎదుట నిలబడ్డాడు. ఎవరో దారిచూపుతున్నట్లుగా ఎంత చక్కగా రాగలిగాడు అని వాడివైపు ఆశ్చర్యంగా చూస్తున్నాను.

"ఉండారా దేవరా?" అన్నాడు.

"కూర్చో!" అన్నాను.

"పరవాలేదులే దేవరా! నిలబడుకొనే పాడతాను. అయితే ఇప్పుడు నన్ను నాటు పాటలు పాడమంటారు."

"అవును."

ఆ మాటతో కూడా ఢక్కీని అరచేతితో తడిమాడు. కండ్లకు అద్దుకొన్నాడు. రెండు చేతులు జోడించి నమస్కరించాడు. రాగాన్ని ఆలపిస్తూ ఢక్కీమీద చేయి పెట్టాడు. వేళ్ళు నాట్యం చేస్తూవుంటే నాదం ఎదలో గిలిగింతలు పెడ్తూ ఉంది.

చల్లపడేటప్పుడు బాన పగిలిందన్నట్టుగా సరిగ్గా అదే సమయానికి మా చెంగమ్మత్త అక్కడ ప్రత్యక్షమయింది.

చెంగమ్మత్తది రంగంపేట. ఆమె అక్కడ కనిపించేవరకు ఆమెది రంగంపేట అన్న సంగతి నాకు గుర్తులేదు. అదే ఆలోచిస్తూ ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉంటే–

"జాతర కొచ్చినావా అల్లుడా? అయితే ఇంటికాడికి రాకుండా ఈ బండమీద కూసుణ్ణావే?" అని దీర్ఘం తీస్తూవుంది.

గుడ్డివాడి ఢక్కా వాద్యం ఆగిపోయింది. అది కళాకారుడి లక్షణం. మధ్య ఏ మాత్రం ఆటంకం జరిగినా అతడు సహించలేడు.

చెంగమ్మత్తకు నేనంటే వల్లమాలిన అభిమానం!

చెంగమ్మత్త భర్త కళ్యాణిడ్యాంలో చేపలు పట్టుతాడు. ఆ చేపల్ని అమ్ముకోవడానికి చెంగమ్మత్త తిరుపతికి వస్తుంది. దాదాపు రెండేండ్ల కిందటెప్పుడో చెంగమ్మత్త దగ్గర మా శ్రీమతి చేపలు బేరమాడుతూ ఉంది. నేను ఊరికే ఉంటే ఊరా పేరా అన్నట్టుగా "ఏఊరత్తా మన్ది?" అని వగలు పద్దాను.

కాసంత వయసుమళ్ళిన వాళ్ళను వరసబెట్టి పిలిస్తే అది వాళ్ళకొక బ్రహ్మానందం. ఆ ఆనందంలోనే తొణికిసలాడతూ చెంగమ్మత్త–

దరణిలో తొండాడ
దాపన ఎలబారి
సెలువైన సెంద్రగిరి
కోటపక్కన దారి
కూచేవాళ్ళపల్లికి
కూత దూరానుంది
పేటంటే పేటరా! అల్లుడా!

దాని పేరే రంగంపేటరా!

–అని ఏకంగా ఒక ఏల పదమే పాడింది.

"అమ్మో! అసాధ్యురాలుగా ఉండావే?" అంటే ఈ గడవని బతుకుల్లో గడప గడపకొక మాట! గంపదించిన సోటొక మాటగదా అల్లుడా!" అనింది.

అద్దో! అప్పటి నుండే చెంగమ్మత్త గంప నెత్తిన బెట్టుకుని తిరుపతిలో ఏ వీధిలో కనుపించినా "ఏమత్తో!" అంటే ముసిముసి నవ్వులు నవ్వుతూ "బాగుండావా అల్లుడా?" అని అడిగేది.

ఆ వేళ అనుకోకుండా అక్కడ ఆమె ప్రత్యక్షమయ్యేసరికి స్మృతి పథంలో గతం తళుక్కున మెరిసింది.

"నన్నింక పాడమంటారా దేవరా?"

గుడ్డివాడు అడుగుతున్నాడు.

"ఈణ్ణి యాడపట్టివి అల్లుడా?"

"బస్సులో వస్తూ ఉంటే పాటలు పాడుకొంటూ అడుక్కుంటున్నాడు. రెండు పాటలు విందామని..."

"వాడు పాటలు పాడ్తే ఇందాఁ వనుకుణ్ణావ్. బాగానే ఉండాది. అయితే అట్టబొయ్ సూడుబో ఆపె ఆపసోపాలు పడ్తా ఉండేది.

"ఎవరత్తా?"

"ఎవురో ఒకరు. వాణ్ణి ఈడ నిలబెట్టేసి దాని పాపమెందుకు కట్టుకుంటావ్. ఒరే గుడ్డెబ్బా! నువ్వు ముందుగా కొంప కాడికి బొయ్ అట్టా ఎలుగిచ్చేసి మల్లాగావాలంటే రారా! వొచ్చి నీకొచ్చినన్ని పాటలు పాడు. అప్పుడు గావాలంటే అల్లుడు తీరిగ్గా కూసోని ఇన్నెంత సేపు ఇంటాడు."

"అది గూడా నిజమే దేవరా! ఇద్దో ఈడుణ్ణెట్టే వచ్చ్యాడస్తా!"

అంటూ గుడ్డివాడు నా మాట కోసరం కూడా ఎదురుచూడకుండా ఆ కన్నీగటిలో చేతికర్రతో దారి వెతుక్కొంటూ ఇంటివైపు నడుస్తున్నాడు.

"ఆపసోపాలు పడే ఆపె ఎవరత్తా?'

"ఇంకెవురు? వాడి సకురాలు!"

"వాడికి సఖురాలా?"

"వాడంటే? వాడేం మణిసి గాడా? మొగోడు గాదా? అయినా ఆ సిన్నది ఎటుమంటిది? సూడ సక్కని సిన్నదే? బెమ్మదేముడు కోరికోరి సేసిన కుందనంపు బొమ్మే! వాడి పాట యినే, ఊళ్ళో పదిమంది కాదుగీదంటే అవునంటే అవుననె. ఏరికోరి గుడ్డోడిసేతికి సెయ్యిచ్చె. ఊరూనాడు కోడై కూస్తా ఉంటే కుశాలగ వాణ్ణి ఎంటబెట్టుకుని తిరిగె. అటుమంటిది దేముడు

ఓర్పకుండా పాయ. దానికి పెద్దమ్మోరొచ్చె. ఆ గంగమ్మతల్లి పోతా పోతా రొండు కండ్లూ తీసుకోనిపాయ"

"అయ్యో పాపం!"

"అయినా దాని పావరం ఏఁవని సెప్పమంటావ్ అల్లుడా? పలానా దినం పలానా యాళకొస్తా నన్నాడంటే పొయ్‌చూసుకో. ఇంట్లోకీ ఈదిలోకీ ఈదిలోకీ ఇంట్లోకీ ఒక్క మోపన తిరగతా ఉంటింది. వాడి అడుగుల సడి ఎట్టా పసి గట్తిందో పసిగట్తింది. అల్లంత దూరానుండగానే 'మాఁవా!' అని ఎలుగిస్తింది. తప్పీ దారి గెంటో అరగెంటో అలీశం అయ్యిందనుకో! గొణుక్కుంటా సణుక్కుంటూ అది పడే యాదనుండాదే అది ఎందుకు సెప్తావులే?"

ప్రేమ గుడ్డిది అంటారు. అయితే ఆ ఇద్దరి గుడ్డివాళ్ళ మధ్య ప్రేమకు చూపు వచ్చింది. ఆ ఇద్దరి అనుబంధం వింటూ వుంటే గొంతులోని మాధుర్యానికి మనసిచ్చిన ఆ చిన్నదాన్ని చూడాలన్న కోర్కె కలుగుతూ ఉంది.

అంతలోనే "అయ్యో! అమ్మో!" అన్న కేకలు వినిపించాయి.

దృష్టి అటువైపు మళ్ళింది.

నేను కూర్చున్న చలువరాతిబండకు ఎదురుగా రోడ్డుకు అవలి వైపున ఒక గుడిసె. గుడిసెముందర పాతికేండ్ల పడుచుపిల్ల. ఆమె అరుస్తూ ఉంది. ఒకడు ఆమె జుట్టుపట్టి వంగదీసి పిడి గుద్దులు గుద్దుతున్నాడు.

ఆమె నోరాడుతూ ఉంది.

వాడి చెయ్యి ఆడుతూ ఉంది.

'అయ్యో! అమ్మో!' అని అరుస్తూనే ఆమె నోటికొచ్చినట్టు బండ బూతులు తిడుతూ ఉంది. ఆమె తిట్టే కొద్దికీ వాడు రెచ్చిపోతూ చావు గుద్దులు గుద్దుతున్నాడు.

"అయ్యయ్యో! పాపిష్టి ముండాకొడుకు. ఆడదానిమీద అలా చేయిచేసుకుంటా ఉన్నాడే? అంతమంది చుట్టూ చేరి వేడుక చూస్తున్నారే. ఒక్కరన్నా జోక్యం చేసుకోవచ్చు గదా?"

"నీకు తెల్దులే అల్లుడా? దానికా శాస్తి జరగాల్సిందే!

"ఆడపుట్టుక పుట్టి నువ్వుగూడా ఆ మాటంటావా అత్తా?"

"పోనీ! నువ్వేజెప్పు నాయం అల్లుడా! అదొక మొగుడొదిలేసిన ముండ. ఎందుకొదిలేసినాడో? ఏం పాడో? ఆ పాపం పున్నెం బగమంతుడికే ఎరిక. మొగుడొదిల్నె ముండ మొబ్బిడిసిన ఎండ రొండూ వొగిటేనంటారు. ఆ ముండ వచ్చి తల్లిసాటన సేరింది. సేరిన కొన్నాళ్ళకే ఎవుణ్ణో ఒకణ్ణి తగులుకునింది. పోనీలే! వయసులో ఉండాది గదా అని ఇక్కన పక్కన ఉండేవోళ్ళు సూసీ సూడకుండా పోతూ వుండ్రి. పాపం వాడు గూడా ఇంటిగ్గావాల్సిన ముప్పైమూడు అరవై ఆరు తెచ్చేస్తా ఉండాడు. ఈ పొద్దు జాతరకని వొస్తే అది ఇంకొకడిపక్కన పొణుకోనుంటే- దాన్నేం చేస్తే తీరు?"

"ఆ గుడ్డిదే మేలుగా ఉందే?"

"సిన్నంగంటావా ఆ మాట అల్లుడా! నీకు తెలవన్దేముండాది? లోకంలో ఎన్నో ఇంతలు జరగతావుండాయి. ఇనోదాలు జరగతావుండాయి. ఎంతమంది అందగాళ్ళు పుట్నారో పుట్టబోతారో? ఆ గుడ్డిదానేకవన్నా.. కాబట్టాయా? దానికి ఎరికయ్యింది... గుర్తుండేది అ గుడ్డోడి రూపమే గదా? అందుకే దాని మఃసు నిండా వాడే! ఈడ అట్టా కాకపాయనే!"

"అంటే?"

"దీనికి కండ్లుండాయి గద అల్లుడా! పాడు కండ్లు. సూసిందంతా కావాలంటాయ్!"

చేపలమ్ముకొనే చెంగమ్మత్త చెప్పింది కొత్త సత్యాన్ని!

పదజాలం కోసరం వెళ్ళితే పరమ సత్యాన్ని తెలుసుకొన్న తృప్తి!!

ఆ గుడ్డి దంపతులు నా మనసంతా ఆవరించుకొన్నారు.

కండ్లున్న గుడ్డివాళ్ళ మానసిక దౌర్బల్యాలు, దౌష్ట్యాలు సంస్కార వర్గానికి ప్రతినిధులుగా నిలబడిన నారెండు కండ్లను బాకులై పొడుస్తుంటే వంచిన తల ఎత్తలేకపోయాను! ●

ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక

(1, అక్టోబర్ 1989)